సంపుటి :02 సంచిక :108 పేజీలు :05

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 27
గరిష్ఠం : 34

## ‘స్థానిక’ పోరుకు సర్కార్ రెడీ!

- వచ్చే నెలలోనే ఉంటాయని సీఎం సంకేతాలు
- క్లీన్ స్వీప్ లక్ష్యంగా పని చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశం
- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల మధ్య 10-15 రోజుల గ్యాప్
- ఆ తర్వాత మున్సిపల్ ఎలక్షన్స్

04

## కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలి

- కేసీఆర్ అంటేనే కాళేశ్వరం అన్నవాళ్లు తప్పుకుంటున్నారు
- కార్పొరేట్ శక్తుల కోసం తలసరి ఆదాయంపై కేంద్రం తప్పుడు లెక్కలు
- కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కగార్ ఆపరేషన్
- ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

04



శనివారం 14, జూన్ 2025



## మరిపెడలో మెడికల్ మాఫియా

02

- ఇష్టారాజ్యంగా ఔషధాల విక్రయాలు
- అధిక ధరకు జనరిక్ మందులు
- మండలంలో సుమారుగా 50 నుంచి 60 షాపులు
- సర్టిఫికెట్ ఒకరిది నడిపేది ఇంకొకరు
- మెడికల్ షాపు యూనియన్ ఏది చెప్తే అదే రైటు
- ‘మామూలు’గా తీసుకుంటున్న డ్రగ్ ఇన్ స్పెక్టర్లు

గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ షాపులంటే సంజీవని కేంద్రాలు.. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని బతికే జీవులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు తీర్చే ఔషధ శాలలు.. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న చిన్న అనారోగ్యాలకు దవాఖానకు వెళ్లలేని వారికి అవే శరణ్యం. ప్రజల అవసరాలను అదనుగా తీసుకున్న కొందరు మెడికల్ షాపు నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే బలమైన మెడిసిన్ విక్రయిస్తున్నారు. కొందరైతే నిషేధిత మెడిసిన్ విక్రయిస్తూ, మామూలు జనరిక్ మందులకు బ్రాండెడ్ మందుల కలరింగ్ ఇచ్చి మెడిసిన్ అంటగడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ‘మామూలు’గా తీసుకుని మిన్నకుంటున్నారు. ఏదైనా గడబిడ జరిగినప్పుడు నామ మాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి




- నెలకు విడుదల చేయాల్సిన బిల్లు రూ.1.84 కోట్లు
- 24 నెలలుగా రూ.44.18 కోట్ల మేర పెండింగ్
- రేపు, మాపు అంటూ.. సర్కార్ కాలయాపన
- తక్షణం విడుదల చేయాలంటున్న ఎంపీడీవోల సంఘం

## ‘గాడీ’ బిల్స్ పెండింగ్

రాష్ట్రవ్యాప్తంగా 570 మంది ఎంపీడీఓలకు వాహన కష్టాలు

తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న ఎంపీడీవోలు 570 మంది వాహన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ఎంపీడీవోకు రూ.32,750 చొప్పున నెలకు రూ.1.84 కోట్ల మేర బిల్లులు విడుదల చేయాల్సి ఉండగా, 24 నెలలుగా పెండింగ్ లోనే ఉన్నాయి. అలా బిల్లులు రూ.44.18 కోట్ల మేర పేరుకుపోయాయి. సొంత డబ్బులు వెచ్చించి వాహనాలు నడుపుతున్నామని, రెండేళ్ల నుంచి సొంత నిధులు వెచ్చిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని, ఇప్పటికైనా సర్కార్ స్పందించి బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ ఎంపీడీవోల సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

03

## 25లోపు రైతుభరోసా

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ప్రకటన
- యాసంగిలో మూడున్నర ఎకరాల్లోపు రైతులకే సాయం
- మిగతావారికి మొండిచేయి చూపిన ప్రభుత్వం
- వానకాలం సీజన్ కూడా వచ్చిన వైనం.. పెట్టుబడి సాయంపై స్పష్టత కరువు

02



## పినతల్లిని నరికి చంపిన వ్యక్తి అరెస్టు

04

## మూడోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు

ప్రణీత్ వాంగ్మూలం కేంద్రంగా ప్రశ్నలు



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడు విశ్రాంత పోలీస్ అధికారి ప్రభాకర్ రావు శనివారం మూడోసారి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరయ్యారు. సిట్ అధికారులు ఆయన్ను హైదరాబాద్ లోని బీఆర్కే భవన్ లో విచారించారు. శుక్రవారం మరో నిందితుడు ప్రణీత్ రావును విచారించిన సిట్ ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఆ వాంగ్మూలం ఆధారంగా సిట్ ప్రభాకర్ రావును విచారించినట్లు సమాచారం. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ చేశారు? వారిలో రాజకీయ నేతలు ఉన్నారా? న్యాయమూర్తులు ఉన్నారా? అనే కోణంలో సిట్ వారిద్దరినీ విచారించినట్లు తెలుస్తున్నది. – అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

02

# రాజీ మార్గమే ఉత్తమం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు**

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: రాజీ మార్గాన్ని ఎంచుకొని వివాదాలు లేని జీవితాలను గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో పంతాలకు పోయి గొడవలు పెట్టుకుంటే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజీ పడి కేసుల్లో నుండి బయటపడాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.నాగరాజు మాట్లాడుతూ క్షమాగుణాన్ని కలిగివుండడం గొప్ప విషయం అన్నారు. ప్రతిఒక్కరు సోదరభావంతో మెలగాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి , ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, డీఏస్పీ సంపత్ రావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక , బెంచి మెంబర్లు సంగం రవీందర్, ఎం.రజినీకాంత్, మంగళంపల్లి రాజ్ కుమార్, లింగంపల్లి విష్ణు, భూక్యా రమేష్ నాయక్, మొయినుద్దీన్, మచ్చ వసంత, సంధ్య. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, చిట్యాల సీఐ మల్లేష్, సాంబమూర్తి న్యాయవాదులు ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.






# మరిపెడలో మెడికల్ మాఫియా

- ఇష్టారాజ్యంగా ఔషధాల విక్రయాలు
- అధిక ధరకు జనరిక్ మందులు
- మండలంలో సుమారుగా 50 నుంచి 60 షాపులు
- సర్టిఫికెట్ ఒకరిది నడిపేది ఇంకొకరు
- మెడికల్ షాపు యూనియన్ ఏది చెప్తే అదే రైటు
- 'మామూలు'గా తీసుకుంటున్న డ్రగ్ ఇన్ స్పెక్టర్లు



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యార్హతలతో సంబంధం లేకుండా కొందరు తమ గుమస్తాలతో షాపులు నడిపిస్తున్నారు. జనరిక్ మెడిసిన్ను కూడా ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకరి ఫార్మసీ సర్టిఫికెట్ ఒకరి పేరు మీద మరొకరు షాపు నడిపిస్తున్నారు. జ్వరం వచ్చిందనో జలుబు చేసిందనో.. డాక్టర్ దగ్గరకు వెళ్తే వందలకు వందలు ఫీజు చెల్లించి, మెడిసిన్ కొనలేమనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంత ప్రజలు మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నారు. మెడికల్ షాపు నిర్వాహకులు వైద్యుడు ప్రిస్క్రిప్షన్ లేకుండానే తమకు అధిక లాభం వచ్చే మెడిసిన్ ను అధిక ధరకు విక్రయిస్తున్నారు. మెడికల్ షాపులపై ఔషధ నియంత్రణ విభాగ అధికారుల నిఘా లేకపోవడంతో మరిపెడలో మెడికల్ మాఫియా దందా మూడు పూవులు.. ఆరు కాయలుగా సాగుతున్నది.





**- దందా ఇలా..**

మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తూ మెడిసిన్ విక్రయిస్తున్నారు. కస్టమర్లకు జనరిక్ మందులు ఇచ్చి బ్రాండెడ్ మందులని నమ్మబలుకుతున్నారు. ఒకే రకమైన మందుల్ని తయారు చేస్తున్న కొన్ని కంపెనీలు జనరిక్ పై ఒక ధర, బ్రాండెడ్ మందులపై మరో ధర ముద్రిస్తున్నాయి. వైద్యుడు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దనే నిబంధనను మెడికల్ షాపుల యాజమానులు తుంగలో తొక్కుతున్నారు. నిబంధనల ప్రకారం.. ప్రతి షాపులో మెడిసిన్ ఇచ్చే ఫార్మసిస్టు డ్రెస్ కోడ్ పాటించాలి. మెడిసిన్ అందించే సమయంలో తప్పకుండా చేతులకు గ్లౌజులు ధరించాలి. కొన్ని ప్రత్యేకమైన మెడిసిన్ను ఫ్రీజ్ లో భద్రపరచాల్సి ఉండగా, నిర్వాహకులు ఆ నిబంధనలేవీ పాటించడం లేదు. మెడిసిన్ కొన్న వినియోగదారుడికి కచ్చితంగా మెడిసిన్ వివరాలు, ధరలకు సంబంధించిన బిల్లు ఇవ్వాల్సి ఉండగా, ఈ నిబంధనలేవీ మరిపెడ మండలంలో అమలు కావడం లేదు. మెడికల్ దుకాణాల యాజమానుల యూనియన్ చెప్పుచేతల్లో డ్రగ్ ఇన్ స్పెక్టర్లు నడచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 50 నుంచి 60 షాపులు ఉండగా, ప్రతి నెలా ఒక్కో యాజమాని నుంచి యూనియన్ నాయకులు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**- నిషేధిత మందుల విక్రయం..**

మండలంలోని మెడికల్ దుకాణాల్లో నిషేధిత మందులైన ట్రామాడాల్, హైడ్రోక్లోరైడ్, ఆల్ప్రజోలం, క్లోనాజిపం, సిల్డినాఫిల్ సిట్రేట్లతోపాటు చాటుమాటుగా గర్భనిరోధక మాత్రలు సైతం కొన్ని షాపుల నిర్వాహకులు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ మండలంలో విచ్చలవిడిగా నిషేధిత మందుల అమ్మకాలు జరుగుతున్నా, కాసులకు కక్కుర్తి పడిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించి మరిపెడ మండలంలో మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

# 25లోపు రైతుభరోసా

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ప్రకటన
- యాసంగిలో మూడున్నర ఎకరాల్లోపు రైతులకే సాయం
- మిగతావారికి మొండిచేయి చూపిన ప్రభుత్వం
- వానకాలం సీజన్ కూడా వచ్చిన వైనం.. పెట్టుబడి సాయంపై స్పష్టత కరువు



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతుల ఖాతాల్లో ఈ నెల 25లోపు రైతుభరోసా సొమ్ము జమ చేసేందుకు సర్కార్ సిద్ధమవుతున్నది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పర్యటనలో భాగంగా ఆయన రైతు భరోసాపై స్పష్టత ఇచ్చారు. ఒక్కో రైతు ఖాతాలో ఎకరానికి రూ.6 వేల చొప్పున జమ చేస్తామని చెప్పారు కానీ, పెండింగ్లో ఉన్న పెట్టుబడి సాయం జమ చేస్తారా? కొత్తగా ఈ వానాకాలం సీజన్ వరకు జమ చేయిస్తారా? అన్నం అంశంపై మాత్రం స్పష్టత లేదు. గత సీజన్ యాసంగిలో మూడున్నర ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రం రైతుభరోసా అందించింది. మూడున్నర ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు సర్కార్ మొండిచేయి చూపింది. ఆ సీజన్ పూర్తయినా ఇప్పటివరకు పెండింగ్ పెట్టుబడి సాయం అందించలేదు. ఇప్పుడు వానాకాలం సీజన్ కూడా వచ్చేసింది. కాబట్టి సర్కార్ ఈ దఫా పెట్టుబడి కూడా అందించాల్సి ఉంది. ఏదేమైనప్పటికీ ఒకటి రెండు రోజుల్లో పెండింగ్ ఉన్న రైతుభరోసాతో పాటు వానకాలం సీజన్ పెట్టుబడి సాయంపైనా సర్కార్ స్పష్టత ఇస్తుందని తెలుస్తున్నది.

# మూడోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు

**- ప్రణీత్ వాంగ్మూలం కేంద్రంగా ప్రశ్నలు**

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడు విశ్రాంత పోలీస్ అధికారి ప్రభాకర్ రావు శనివారం మూడోసారి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరయ్యారు. సిట్ అధికారులు ఆయన్ను హైదరాబాదులోని బీఆర్కే భవన్లో విచారించారు. శుక్రవారం మరో నిందితుడు ప్రణీత్ రావును విచారించిన సిట్ ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఆ వాంగ్మూలం ఆధారంగా సిట్ ప్రభాకర్ రావును విచారించినట్లు సమాచారం. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ చేశారు? వారిలో రాజకీయ నేతలు ఉన్నారా? న్యాయమూర్తులు ఉన్నారా? అనే కోణంలో సిట్ వారిద్దరినీ విచారించినట్లు తెలుస్తున్నది.

# రక్తదాన శిబిరం విజయవంతం

- పాల్గొన్న జర్నలిస్టులు
- 250 యూనిట్ల రక్తం సేకరణ

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీ మాస్టర్ యజమాన్యం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐటీ మాస్టర్ క్యాంపస్ లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైందని సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008 నుండి ప్రతీ సంవత్సరం ఐటీ మాస్టర్ యజమాన్యం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులతో పాటు ప్రజాసంఘాలు, స్టూడెంట్స్, సింగరేణి కార్మికులు, ఉద్యోగులు పాల్గొని స్వచ్ఛందంగా 280 యూనిట్ల రక్తాన్ని ఇచ్చినట్లు తెలిపారు.



# మోటర్ రిపేరులో అధికారుల నిర్లక్ష్యం తగదు



అక్షర దర్బార్, కేసముద్రం : వాటర్ ట్యాంక్ మోటార్ రిపేర్ చేయడంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. శనివారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకు ద్వారా దాదాపు 30 కుటుంబాలకు నీరు అందేది అన్నారు. వాటర్ ట్యాంక్ మోటరు రిపేర్ కు వచ్చి దాదాపు రెండు నెలలు గడిచినా నేటికీ రిపేరు చేయకపోవడంతో వాటర్ ట్యాంక్ పై ఆధారపడ్డ కుటుంబాలు నీళ్ల కోసం నానా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్ని కాలనీవాసులు మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. నీళ్ల కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్న అధికారులు నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ మోటార్ ను రిపేర్ చేసి ప్రజల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు దండు శరత్, శ్రీను, సుహాసిని, సరిత, విజయ, ప్రియాంక, సరిత, సుధామణి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ చీఫ్ ను కలిసిన మల్లేశం గౌడ్



అక్షర దర్బార్, పరకాల : టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ను శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని గాంధీభవన్ లో పరకాల కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఆముదాలపల్లి మల్లేశం గౌడ్ మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# 'గాడీ' బిల్స్ పెండింగ్

- రాష్ట్రవ్యాప్తంగా 570 మంది అధికారులు
- నెలకు విడుదల చేయాల్సిన బిల్లు రూ.1.84 కోట్లు
- 24 నెలలుగా రూ.44.18 కోట్ల మేర పెండింగ్
- రేపు, మాపు అంటూ.. సర్కార్ కాలయాపన
- తక్షణం విడుదల చేయాలంటున్న ఎంపీడీవోల సంఘం




అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న 570 మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల (ఎంపీడీవో)ను వాహన కష్టాలు వెక్కిరిస్తున్నాయి. అద్దె ప్రాతిపదికన వారు వినియోగించే వాహన బిల్లులను 24 నెలల నుంచి పెండింగ్లో పెడుతూ వస్తున్నది. ఒక్కో ఎంపీడీవో వాహనానికి నెలకు రూ.32,750 చొప్పున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి అద్దె డబ్బు చెల్లించాల్సి ఉండగా, ఎక్కడివక్కడా ఆగిపోయాయి. ఎంపీడీవోలు చొరవ తీసుకుని ఉన్నతాధికారులను అడిగితే వాహన అలవెన్స్ బడ్జెట్ లేదని, రేపిస్తాం.. మాపిస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని తెలంగాణ ఎంపీడీవో అసోయేషన్ నేతలు వాపోతున్నారు. కొన్ని శాఖల్లోని అధికారులకు రెండు నెలలకోసారి వాహన బిల్లులను చెల్లిస్తున్న ప్రభుత్వం.. ఎంపీడీవో వాహన సమస్యలను మాత్రం ఖాతరు చేయడం లేదని వాపోతున్నారు.

**- గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు..**

రాష్ట్రంలో మొత్తం 570 మంది ఎంపీడీవోలు విధులు నిర్వర్తిస్తుండగా, వీరిలో సుమారు 200మంది మహిళా ఎంపీడీవోలే. వారంతా నిత్యం తమ మండల పరిధిలోని గ్రామాలను సందర్శించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం పనులతోపాటు సర్కార్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షించాల్సి ఉంటుంది. అందుకే.. ప్రభుత్వం ఒక్కో ఎంపీడీవోకు అద్దె ప్రాతిపదికన వాహన సౌకర్యం కల్పిస్తున్నది. వాహనాల కిరాయి కోసం ఒక్కో ఎంపీడీవోకు ప్రతి నెలా రూ.32,750 చొప్పున ఉపాధి హామీ పథకం నిధుల నుంచి చెల్లించాల్సి ఉన్నది. 2023 మార్చి వరకు ఎంపీడీవోల వాహన బిల్లులను గత ప్రభుత్వం విడుదల చేసింది. తర్వాత బిల్లలు విడుదల కాలేదు. కొత్త సర్కార్ వాహన బిల్లుల గురించి పట్టించుకోవడం లేదు. 570 మంది ఎంపీడీవోలకు నెలకు రూ.1.84 కోట్ల చొప్పున బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. 24 నెలలుగా విడుదల చేయకపోవటంతో రూ.44.18 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దీంతో తాము సొంత సొమ్ముతో వాహన కిరాయిలు చెల్లించాల్సి వస్తున్నదని ఎంపీడీవోలు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాహన బిల్లులు విడుదల చేయాలని రాష్ట్ర ఎంపీడీవోల సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.



# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**మంత్రి పొన్నంకు మాజీ సర్పంచ్ ల వినతి**

అక్షర దర్బార్, పరకాల : పెండింగ్ బిల్లులు విడుదల చేసి మాజీ సర్పంచులను ఆదుకోవాలని రవాణా శాఖ మంత్రి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం అందజేసిన రాష్ట్ర సర్పంచ్ల ఫోరం జాయింట్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, నడికూడ సర్పంచ్ ఊర రవీందర్ రావు , ముస్త్యలపల్లి సర్పంచ్ బొట్ల సంధ్య రవి, పులిగిల్ల సర్పంచ్ పాలకుర్తి సదానందం గౌడ్, రాయపర్తి సర్పంచ్ రావుల సరిత రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజంలో విలువలు పాటించాలి

**కేయూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్**




అక్షర దర్బార్, పరకాల : సమాజంలో చోటు చేసుకున్న సంఘటనలను ఒక చిత్రాన్ని ప్రజల మనోగతాన్ని మీడియా ప్రతిబించాలని, జర్నలిజంలో విలువలు పాటించాలని కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం 2023-2025 జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంకు దూర విద్య కేంద్రం సమావేశం మందిరంలో నిర్వాహించారు. సమావేశానికి ముందుగా అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు నివాళిగా మౌనం పాటించారు. అనంతరం డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి చావులు లేని సమాజం నిర్మించే విధంగా జర్నలిస్టులు తపన పడాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులకు సృజనాత్మకతతో పాటు ఆత్మవిశ్వాసం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహారాములు, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ సుధాకర్, పెరుమళ్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి, సిబ్బంది ప్రనుప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం నూతన కమిటీ



అక్షర దర్బార్, పరకాల : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పరకాల డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ మేరకు శనివారం నూతన కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివి రాజు, అంతడుపుల శ్రీనివాస్ లు ప్రకటించారు. టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అద్యక్షుడిగా కోగిల చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా చెరుపెల్లి సత్యం, చిట్టిరెడ్డి అజయ్ రెడ్డి, కార్యదర్శిగా కొల్లూరి ప్రేమ్ చంద్, కోశాధికారి గా సిలువేరు రాజు, సహాయ కార్యదర్శులు నాగెల్లి సంతోష్ , గిరబోయిన రాజు కార్యవర్గ సభ్యులుగా, దొమ్మటి అంబేద్కర్, ముక్కెర చిరంజీవి, చుక్క సతీష్, గొట్టె రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ టీడబ్ల్యూజేఎఫ్ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

# గోదాం చుట్టూ సీసీ రోడ్డు వేయాలి



అక్షర దర్బార్, పరకాల : పరకాల వ్యవసాయ మార్కెట్ లో నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన 5వేల మెట్రిక్ టన్నుల గోదాం చుట్టూ సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లంక దాసరి అశోక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ లో ఉన్న గోదాంలోకి లారీలు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, వర్షాకాలంలో లోడ్ తో ఉన్న లారీలు బూరదలో దిగబడడంతో అక్కడ నుండే గోదాం వరకు హమాలీలు బస్తాలు మోయాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాం చుట్టూ సిసి ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు, ప్రధాన కార్యదర్శి నాగేల్లి శంకర్, కోగిల శంకరయ్య, రేణికుంట్ల రాజయ్య, కోడపాక ఐలయ్య, కోట యాదగిరి, బొట్ల భద్రయ్య, కోడపాక చిరంజీవి, శ్రీపతి రాజయ్య, శ్రీపతి కుమార్ స్వామి, కోగిల కైలాసం, జన్ను పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- వివిధ పార్టీల ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

అక్షరదర్బార్, వరంగల్: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం వరంగల్ ఓంకార్ భవన్ లో ఆ పార్టీల జిల్లా నాయకులు సభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, సిపిఎం జిల్లా నాయకులు వలదాసు దుర్గయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి యాదగిరి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు మోడెం మల్లేశం, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చందర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు జనగాం కుమార స్వామి, భారత్ బచావో జిల్లా నాయకులు ప్రవీణ్, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు జన్ను కుమారస్వామి తదితరులు మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా మోడీ ప్రభుత్వం హత్యాకాండ ఆగలేదని వారన్నారు. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు ఓంకార్ భవన్ నుండి వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వరకు ర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.









# పినతల్లి హత్య కేసులో వ్యక్తి అరెస్టు

అక్షరదర్బార్, హనుమకొండ: పినతల్లిని గొడ్డలితో నరికి చంపిన వ్యక్తిని హనుమకొండ కేయూసీ పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ ఏసీపీ నర్సింహారావు శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో చల్లా భూపాల్ రెడ్డి ఈ నెల 11న రాత్రి తన పినతల్లి చల్లా సరోజన (55)ను గొడ్డలితో నరికి చంపాడు. భూపాల్ రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డికి మృతురాలు సరోజన రెండో భార్య. భూపాల్ రెడ్డి తల్లి వనమ్మ చనిపోయిన తర్వాత తండ్రి శ్రీనివాసరెడ్డి సరోజనను రెండో వివాహం చేసుకున్నాడు. శ్రీనివాస్ రెడ్డి, సరోజనకు ఇద్దరు కూతుళ్లు జన్మించారు. అయితే తన పట్ల చిన్నప్పటి నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన భూపాల్ రెడ్డిలో ఏర్పడింది. ఈ క్రమంలో తమ కుటుంబానికి చెందిన మూడున్నర ఎకరాల భూమిని ఇద్దరు కూతుళ్లకు పట్టా చేసిన ప్పటి నుంచి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం శ్రీనివాస్ రెడ్డి గాయపడి వ్యవసాయం చేయలేని స్థితిలో ఉన్నాడు. దీంతో శ్రీనివాస రెడ్డికి చెందిన రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు చేస్తానని భూపాల్ రెడ్డి అడగగా సరోజన అభ్యంతరం తెలిపింది. దీంతో 11న రాత్రి 10 గంటల సమయంలో సరోజన బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా ఇంటి గేటు వద్ద కాపు కాసి గొడ్డలితో సరోజన తలపై, ఇతర చోట్ల నరికి ఆమెను చంపినట్లు నిందితుడు భూపాల్ రెడ్డి పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఈ నేపథ్యంలో భూపాల్ రెడ్డిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసి అతని వద్ద గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నరసింహారావు చెప్పారు. హత్య జరిగిన 24 గంటల్లోనే చేధించి నేరస్తుడిని పట్టుకున్న కేయూసీ ఇన్ స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్ ను ఏసీపీ అభినందించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలి

- కేసీఆర్ అంటేనే కాళేశ్వరం అన్నవాళ్లు తప్పుకుంటున్నారు
- కార్పొరేట్ శక్తుల కోసం తలసరి ఆదాయంపై కేంద్రం తప్పుడు లెక్కలు
- కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కగార్ ఆపరేషన్
- ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




అక్షరదర్బార్, హనుమకొండ: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, ప్రజలపై భారం మోపే కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని అన్నారు. దాని నిర్వహణ కోసం ఏటా వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం... కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు నేడు నోరు మూసు కున్నారని, తన మెదడును కరిగించి డిజైన్ చేశానని, కాళేశ్వరంకు అన్నీ నేనే అన్న కేసీఆర్ ఇప్పుడు నాకు సంబంధం లేదంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ బాధ్యత ఇంజనీర్ లదే అని నేడు తప్పించుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు.

* పేదలు లేని దేశంగా చూపాలని కుట్ర

భారతదేశం ఆర్థికంగా జపాన్ ను దాటి నాల్గవ స్థానం ఆక్రమించిందని కేంద్ర సర్కార్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతుందని, కృత్రిమంగా పేదలు లేని దేశంగా చూపాలని ప్రయత్నిస్తున్నదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందితే అసమానతలు ఎందుకు పోలేదని, ప్రజలు పేదరికంలో ఎందుకు మగ్గుతున్నారని ప్రశ్నించారు. ప్రతిరోజు రూ.280ల నుండి రూ.320లు సంపాదిస్తే పేదలు ధనవంతులుగా ఎలా మారుతారని ప్రశ్నించారు. నెలకు రూ.8వేలకు కుటుంబాన్ని ఎలా పోషించుకుం టారన్నారు. నెలకు రూ.20వేల ఆదాయం ఉన్నా పేద వారుగానే పరిగణించాలని అన్నారు. బతుకుదెరువు లేకుండా ఆర్థాకలితో ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ప్రపంచ దేశాల్లో ఆకలితో అలమటిస్తున్నవారిలో దేశం 101 స్థానంలో నిలిచిందని, ప్రజలకు విద్య, వైద్యం కల్పించటంలో, కొనుగోలు శక్తిలో 124 స్థానంలో నిలిచినట్లు సూచికలు తెలుపుతున్నాయన్నారు. కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కలలు కంటున్నదని విమర్శించారు. కమ్యూనిస్టుల మృతదేహాలను చూసి కేంద్రం భయపడుతోందని, పోలీసుల కాల్పుల్లో చనిపోయిన నంబాల కేశవరావు మృతదేహాన్ని ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్టప్రకారం కేసులు పెట్టాలని, 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఒక ఫ్యూడల్, గూండా, ఫాసిస్ట్ పాలనకు నిదర్శనం అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత యోగా శిక్షణ తరగతులు

యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు

అక్షర దర్బార్, పరకాల : అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగ గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో పరకాల పట్టణం గణపతి కాలేజీలో ఉచిత యోగా శిక్షణా తరగతులు ఉదయం 5.30 నుండి 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొని యోగాతో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, షుగర్,ఆస్తమా, థైరాయిడ్,మస్త్యం నుండి ఉపశమనం పొందుతారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9963726521 నంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.



# లేడీ కిలాడి అరెస్ట్

- వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిన యువతి
- లవర్ తో కలిసి పరార్
- ఇద్దరినీ పట్టుకున్న పోలీసులు



అక్షరదర్బార్, వర్ధన్నపేట: వృద్ధురాలి మెడలో నుంచి బంగారం గొలుసును లాక్కెళ్లిన లేడీ కిలాడిని, ఆమెకు సహకరించిన లవర్ ను వర్ధన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి నుంచి 24 గ్రాముల బంగారం గొలుసును స్వాధీనం చేసుకున్నారు. వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలో ఈనెల 11న రాత్రి వృద్ధురాలు పేరంబుదూరు సుజాత మెడలో నుంచి గ్రామానికి చుట్టపు చూపుగా వచ్చిన యువతి రామాయణం హేమలత బంగారం గొలుసును లాక్కెళ్ళింది. ఇంటి ముందు నిలబడి ఉన్న సుజాత వద్దకు వెళ్లిన హేమలత మాట్లాడినట్లు నటిస్తూ సుజాత మెడ పిసికి, అరవకుండా నోరు మూసి కింద పడేసి ఆమె మెడలో ఉన్న బంగారం మంగళసూత్రం తాడును తెంపుకొని పారిపోయింది. ప్లాన్ ప్రకారం అప్పటికే గ్రామ శివారులో ఉన్న తన లవర్ పిడియాల రాముతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇద్దరు కలిసి ఖమ్మం వెళ్లారు. రెండు రోజులు ఖమ్మంలో ఉండి బంగారం గొలుసు అమ్మేందుకు శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వరంగల్ కు బయలుదేరారు. వాహన తనిఖీల్లో భాగంగా ఉదయం వర్ధన్నపేట శివారులో పోలీసులు లేడీ కిలాడి హేమలత, ఆమె లవర్ పిడియాల రామును అదుపులోకి తీసుకొని హేమలత వృద్ధురాలి మెడలో నుంచి లాక్కెళ్లిన 24 గ్రాముల బంగారం గొలుసును, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వర్ధన్నపేట ఎస్సై రాజు, కానిస్టేబుల్స్ సురేష్, రంజిత్, కల్పన, సానియా ఫర్హాన్, స్వాతిలను సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

# వికసిత్ భారత్ వైపు అడుగులు

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ11 ఏళ్ళ పాలనను 11ఏళ్ళ సేవగా నిర్వహిస్తూ వికసిత్ భారత్ కి దేశం అడుగులు వేస్తున్నదని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం 11 ఏళ్లు మోదీ పాలన కార్యక్రమన్నీ వరంగల్ జిల్లా కో కన్వీనర్ వడ్డేపల్లి నరసింహరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాగ ముఖ్య అతిధులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి హాజరై మొదట మొక్కలు నాటీ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి పథకాలు, సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో



బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవుల రాణా ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .






## 'స్థానిక' పోరుకు

# సర్కార్ రెడీ!

- వచ్చే నెలలోనే ఉంటాయని సీఎం సంకేతాలు
- క్లీన్ స్వీప్ లక్ష్యంగా పని చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశం
- అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని సూచన
- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల మధ్య 10-15 రోజుల గ్యాప్
- ఆ తర్వాత మున్సిపల్ ఎలక్షన్స్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కార్ సిద్ధమవుతున్నది. వచ్చే నెలలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసేలా కష్టపడి పని చేయాలని నేతలకు ఇటీవల దిశానిర్దేశం చేశారు. ఈ టాస్క్ ను ప్రతి ఎమ్మెల్యే, మంత్రి సక్సెస్ చేయాలని.. ఇందుకు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ లీడర్లు సహకరించాలని సూచించారు. ఈ ఎన్నికలు ఏడాదిన్నర ప్రభుత్వ పనితీరుకు పరీక్ష లాంటివని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని చెప్పినట్టు తెలిసింది. క్యాడర్ తో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు మంత్రులు కూడా నియోజకవర్గాల బాట పట్టారు. లోకల్బాడీ ఎన్నికల టాస్క్ ను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారు. ఇటీవల మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడిన ఆయన.. ఎన్నికలు కాస్త లేట్అయినా 100 శాతం కొట్టి తీరాలని, క్లీన్ స్వీప్ చేయాలని అన్నట్టు తెలిసింది. జిల్లా మంత్రులు, ఇన్ చార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను గడపగడపకూ చేర్చాలి. ఈ నెల చివరి వారం కల్లా నియోజకవర్గాల్లో అన్ని గ్రామాలను ఎమ్మెల్యేలు చుట్టి రావాలి. ఇక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ నుంచి కౌన్సిలర్లు, వార్డు మెంబర్ల దాకా పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. గెలుపు గుర్రాలనే బరిలోకి దింపాలి. పార్టీ కోసం ముందు నుంచి పనిచేసినోళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. రెబల్స్ అనే మాట రాకుండా, అప్రమత్తంగా ఉంటేనే వందకు వందశాతం క్లీన్ స్వీప్ చేయగలం' అని చెప్పి నట్టు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో స్థానిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలను రూపొందించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎం చెప్పడంతో.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా ఇప్పటికే నియోజకవర్గాల్లో పాగా వేశారు. క్యాడర్ తో సంప్రదింపులు కొనసాగిస్తూనే క్షేత్రస్థాయిలో తిరుగుతూ శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

### ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు..

లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు సర్కార్ నుంచి ఇటీవల ఆదేశాలు అందాయి. దీంతో ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో పాటు ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసింది. కేవలం రిజర్వేషన్లు, నోటిఫికేషన్ తేదీల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల కోసం వేచిచూస్తున్నది. కాగా, ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే తాజాగా ఎన్నికలు జరుగుతాయని ఆఫీసర్లు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లు రాష్ట్రపతి దగ్గరే పెండింగ్ లో ఉంది. అది ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించకపోవడంతో పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అధికార పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో చట్ట ప్రకారం బీసీలకు 23 శాతం వరకు సీట్లు కేటాయించినా.. ఓపెన్ కేటగిరీలో మిగిలిన సీట్లను కేటాయించనున్నట్టు తెలిసింది.

**- సర్పంచ్ , ఎంపీటీసీలో**

## ఏది ముందు?

**సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఏది ముందు జరిగినా.. వీటి మధ్య కేవలం 10- నుంచి15 రోజుల వ్యవధి మాత్రమే ఉండనున్నట్టు తెలిసింది. ఆ తర్వాతే జడ్పీటీసీ, మున్సిపల్ఎన్నికలు నిర్వహించనున్నట్టు సమాచారం. సర్పంచ్ఎన్నికల్లో పార్టీ సింబల్ ఉండదు. ఎంపీటీసీ ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తుతో జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఏ ఎన్నికలు ముందు నిర్వహిస్తే అధికార పార్టీకి లాభం అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నది. దీనిపై ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. కాగా, ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు సర్పంచ్ ఎన్నికలు ముందు నిర్వహించి, ఆ తర్వాతే ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రస్థాయిలో ఎదుర్కోనున్న తొలి ఎన్నికలు కావడంతో అధికార పార్టీ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు పీసీసీ కార్యవర్గాన్ని సైతం ప్రకటించడంతో కాంగ్రెస్ క్యాడర్ జోష్ మీద ఉంది. దీనికితోడు పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టారు. లోకల్ బాడీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా రివ్యూలు నిర్వహిస్తూ అటు లీడర్లను, క్యాడర్ ను సమాయత్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడ్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.**



# ఏకతాటిపై ఉండాలి

**- ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు**

**- ఘనంగా వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, కృతజ్ఞత సభ**

అక్షరదర్బార్, హనుమకొండ: వెలమలు ఏకతాటిపై ఉండాలని ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వెలమ సంక్షేమ భవన్ లో శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం, కృతజ్ఞత సభ ఘనంగా జరిగింది. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘం సభ్యులందరూ కలిసి కట్టుగా ముందుకు సాలని అన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, నిర్విరామంగా అందరి ఆలోచనలకు అనుగుణంగా వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి, అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పుస్కూరి మోహన్ రావు ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పిన్నింటి బాల చందర్ రావు, తక్కలపెల్లి శ్యామ్ సుందర్ రావు, తక్కల్లపెల్లి రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పల్లెపాటి విద్యాసాగర్ రావు, కోశాధికారి సిద్దూరి స్వామిరావు, కార్యవర్గ సభ్యులు పుస్కూరి రఘుకుమార్, గండ్ర ప్రభాకర్ రావు, మార్నేని రవీందర్ రావు, తక్కలపెల్లి రవీందర్ రావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్ రావు, తక్కల పెల్లి అమృత రావు, గండ్ర గోపాల్ రావు, లింగంపల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వర్ రావు, జలగం రంజిత్ కుమార్, ఎన్నమనేని శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు తక్కళ్లపల్లి బుచ్చిబాబు, వీరమనేని ప్రసాద్ రావు, పల్లెపాటి బాలకిషన్ రావును ప్రెసిడెంట్ అనౌన్స్ చేశారు. అడ్వైజర్స్ గా బొంపల్లి వెంకట్రావు, తక్కళ్లపల్లి వెంకటేశ్వర్ రావు, పిన్నింటి కిషన్ రావు, పిన్నింటి వెంకట్రావు, ప్రొఫెసర్ దయాకర్ రావు, దేశినేని సత్యనారాయణ రావు , డాక్టర్ అర్శనపల్లి మోహన్ రావు, మర్రి రంగారావు, సిరికొండ తిరుపతిరావు, ఏపూరి సత్యనారాయణరావు నియమితులయ్యారు.



# గంజాయి పట్టివేత

అక్షర దర్బార్, శాయంపేట : అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకొని నలుగురిని అరెస్టు చేసినట్లు శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. మండలంలోని ఆరేపల్లి గ్రామంలో శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తూ ఆరేపల్లి వాటర్ ట్యాంక్ వద్దకి చేరుకోగా అక్కడ నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండి పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకొని విచారించగా వారి వద్ద ఒక కేజీ 100 గ్రాముల ఎండు గంజాయినీ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915